క్లుప్తంగా

విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు



కళాశాలలో చేస్తున్న హెచ్‌బీ పరీక్షలు

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు, అధ్యాపకులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కీలక భూమిక యువతదేన్నారు. అలాంటి యువత ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రక్తంలో హెచ్‌బీ శాతం ఎక్కువగా ఉంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, వైద్య బృందం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బూరగమందలో కంటి వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: మండలంలోని బూరగమంద జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 140 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్టు హెచ్‌ఎం సుమతమ్మ తెలిపారు. వీరిలో 15మంది దృష్టి లోపాలతో బాధపడుతున్నట్టు నిర్ధారించారని, వారికి కళ్లద్దాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ నరసింహులు, ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, ఉదయ భాస్కర్, శ్రీవాణి, సుమలత పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రామకుప్పం: రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ అమరావతి మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 9,10వ తేదీల్లో ఈ పోటీలు నిర్వహించారు. రెండు బంగారు, రెండు రజత, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులు, పీఈటీ సంధ్యను ప్రిన్సిపల్ అభినందించారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వి.కోట: మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీటీసీ సమ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొంగాటం పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. జెడ్పీ నిధులతో ఈ రోడ్లు వేయనున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. త్వరిగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్, వార్డు సభ్యుడు బాబుజాన్, మణి, పంచాయతీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

చౌడేపల్లి: కొత్తగా మంజూరైన పెన్షన్లు బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి తెలిపారు.

నేడు వాహనాల వేలం



పుంగనూరులో వేలం వేయనున్న వాహనాలు

పుంగనూరు: అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన 15 మోటార్ సైకిళ్లను బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: వివిధ మద్యం కేసుల్లో సీజ్ చేసిన మూడు వాహనాలను బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. రెండు మోటార్ సైకిళ్లు, ఒక అశోక్ లైలాండ్ వాహనాన్ని వేలం వేస్తామని, ఆసక్తి కలిగిన వారు రెండు వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ప్రజల ఆశీర్వాదమే బలం

- పలు రాష్ట్రాలను ఆకర్షిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ని ప్రజలకు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ప్రజలకు ఒక్కసారి మాటిస్తే కచ్చితంగా నెరవేర్చే ముఖ్యమంత్రుల్లో ఆనాడు దివంగత సీఎం వైఎస్సార్ అయితే, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. రాష్ట్ర ప్రగతి ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించేలా ఆయన పరిపాలన చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని గంగ్రాజుపల్లె-2 సచివాలయ పరిధిలోని పెద్దఉగిణిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత ఆలకుప్పంలో రూ.17.65 లక్షలతో నిర్మించిన జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం (బీఎంసీ) నూతన భవనాన్ని, ఆ తరువాత పెద్ద ఉగిణిలో రూ.7 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. ప్రజల ఆశీర్వాదమే తమ ప్రభుత్వానికి బలమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీకి పతనం తప్పదు

పాదయాత్రలో ఇచ్చిన హామీలను, ఇవ్వని హామీలను సైతం అధికారంలోకి రాగానే నెరవేర్చి, ప్రజల హృదయాలను జగనన్న గెలిచారని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన నిరంతరం పాటు పడుతున్నారని పలు పథకాలను ఉదహరించారు. ఇలాంటి ప్రభుత్వంపైన నిత్యం విషం చిమ్ముతున్న టీడీపీ కుట్రపూరిత రాజకీయాలు, దీనికి వంత పాడుతున్న ఎల్లో మీడియాను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్యాకేజీ స్టార్‌తో కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీకి పతనం తప్పదని, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని, ప్రజాధనాన్ని ఎలా అడ్డగోలుగా దోచుకున్నాడో ప్రజలకు తేటతెల్లమైందని, మరోసారి బుద్ధి చెప్పడానికి వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, వైస్ ఎంపీపీ ఆదాంబాషా, ఎంపీటీసీ భాస్కర్, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, రాధాక్రిష్ణ, చలపతిరెడ్డి, కిషోర్‌గౌడ, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బీఎంసీ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



గంగవరం జెడ్పీ హైస్కూల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. మండలంలో మన బడి నాడు- నేడు మొదటి ఫేజ్ కింద జీడిమాకుల పల్లె ప్రాథమిక పాఠశాల, గంగవరం జెడ్పీ హైస్కూల్, కొత్తపల్లె, రెంటకుంట్ల, కలగటూరు, ఏడూరు ప్రాథమిక పాఠశాలలు, కీలపట్ల కెజిబివి, చిన్నమనాయనిపల్లె ఉన్నత పాఠశాల భవనాలను రూ. 2.28 కోట్లతో పూర్తి చేశారు. వీటిని ఎమ్మెల్యే శిలాఫలకాలు ఆవిష్కరించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దామని, వసతులు, విద్యాబోధన, పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్నింటా రాణించాలన్నారు. పట్టుదలతో బాగా చదివి, ఉన్నత స్థాయికి చేరుకుని సీఎం జగనన్నకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు సమంజసమే



సమావేశంలో మాట్లాడుతున్న మురళీ మోహన్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సమంజసమేనని జిల్లా సహకార ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ గోటూరి మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కల్లూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైన శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు అడ్డగోలుగా ప్రజాధనాన్ని షెల్ కంపెనీల పేరిట లూటీ చేశారనేది తేటతెల్లమైందన్నారు. గతంలో కూడా పలు కేసుల్లో స్టే తెచ్చుకుని ఉన్న ఆయన అవినీతి లీలలు మరికొన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. బాబు అరెస్ట్ ఉదంతంపై టీడీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చినా ప్రజలు స్పందించకలేదని, సాక్షాత్తు 'హెరిటేజ్' కూడా యథావిధిగా వ్యాపారం చేసిందని అపహాస్యం చేశారు. సమావేశంలో ఎస్‌ఎస్ రెడ్డి ప్రకాష్, రాయల్ మోహన్, చైతన్యరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎస్వీ రమణ, నిరంజన్‌రెడ్డి, రాంకుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగయ్య, గురుస్వామి, కుమార్, సైదు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సోమలలో 'జగనన్నకు చెబుదాం'

సోమల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బుధవాధం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాగరాజ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెడ్మాస్టర్లు పాల్గొనాలన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలిజేయాలని కోరారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

రామకుప్పం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలస్థాయి క్రీడా పోటీలను బుధవారం నుంచి శుక్రవారం వరకు స్థానిక గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ మణి తెలిపారు. బుధవారం వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, గురువారం ఖో-ఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, శుక్రవారం అన్ని రకాల అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలకు ఎంపిక చేస్తామన్నారు. మండలంలోని పీడీలు, పీఈటీలు క్రీడాకారులను ఈ పోటీలకు తీసుకురావాలని మండల విద్యాశాఖాధికారి మహబూబ్‌బాషా కోరారు.

14, 15న శాంతిపురం మండలంలో...

శాంతిపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా నియోజకవర్గ స్థాయి పోటీల ఎంపికకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపిక పోటీలు మఠం వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారన్నారు. 14న వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, 15న ఖో-ఖో, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా, 16న అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల పీడీలు, పీఈటీలు తమ క్రీడాకారులు, జట్లను పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. మండలంలోని బురిశెట్టిపల్లెలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారుల సలహాలు-సూచనలు పాటిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.

ప్రతి ఇంటా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సీతారామన్, మెడికలాఫీసర్ సల్లా, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బందితో ఆయన జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి నమోదు చేయాలన్నారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి, వారికి టోకెన్లు జారీ చేసి, వైద్య శిబిరానికి తరలించాలన్నారు. దీనిని బయోమెట్రిక్ ద్వారా పూర్తి చేయాలన్నారు. వీటిని పకడ్బందీగా నిర్వహించి, అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని, రోగులను గుర్తించి వారికి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ సరోవర్'తో భూగర్భ జలాల పెంపు



చెరువు గట్టుపై మొక్కలను పరిశీలిస్తున్న సూర్యకుమారి

ఐరాల: 'అమృత్ సరోవర్' పనులతో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని రాష్ట్ర పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ.సూర్య కుమారి అన్నారు. మంగళవారం వడ్రంపల్లె గ్రామ పంచాయతీలోని మెట్టఇండ్ల వద్ద రూ.4.40 లక్షలతో చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కింద చెరువుల్లో ఇలాంటి పనులు చేస్తే వర్షపు నీరు చేరి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. అమృత్ సరోవర్ కింద చేపట్టిన కుంట లోతు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి చేపల పెంపకం, ప్లాంటేషన్ కింద కొబ్బరి మొక్కలు పెంచి, ఆర్థిక వనరులను పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి, దాతల సహకారంతో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని చూసి సర్పంచ్‌ను అభినందించారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా డీఆర్‌డీఏ పీడీలు గంగాభవాని, తులసి, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవికుమార్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రాణప్రతిష్ఠ



కలశస్థాపన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్

- నేడు కుంభాభిషేకానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక

గుడుపల్లె: మండలంలోని మల్లప్ప కొండపై నిర్వహిస్తున్న నూతన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం మహోత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ హోమాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీ మల్లేశ్వరస్వామి మూల విగ్రహం, ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద శాస్త్రోక్తంగా వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆ విగ్రహాలతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ విమాన గోపుర కలశ ప్రతిష్ఠ జీర్ణోద్ధరణ నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ

మల్లప్పకొండపై విగ్రహ ప్రతిష్ఠాపన, హోమాల వద్ద ప్రత్యేక పూజల్లో జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పాల్గొన్నా రు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేద పండితులకు ఆయన పట్టు వస్త్రాలను సమర్పించారు. బుధవారం నిర్వహించే మహా కుంభాభిషేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. కుప్పం రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రతిష్ఠాపనకు యాగశాలలో ఏర్పాటు చేసిన శ్రీ మల్లేశ్వరస్వామి విగ్రహం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



పెన్షన్లు పంపిణీ చేస్తున్న కొండవీటి నాగభూషణం, అలీమ్‌బాషా, నాగభూషణం, కృష్ణమూర్తి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తామని రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తితో కలసి నూతన పెన్షన్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసిన 330 మందికి మంజూరు చేశామన్నారు. అలాగే నవరత్నాల పథకాల ద్వారా అర్హులైన వారికి అమ్మఒడి, చేయూత, ఆసరా, సున్నావడ్డీతో పాటు సుమారు ఏడువేల మందికి ఇంటి స్థలాలు,1,532 మందికి టిడ్కో గృహాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో మంజూరు చేశామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు పూల త్యాగరాజు, కిజర్‌ఖాన్, నరసింహులు, రేష్మా, సాజిదాబేగం, భారతి, కొండవీటి గంగులమ్మ, కాంతమ్మ, పద్మావతి, రాఘవేంద్ర, కమలమ్మ, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కేశవులు

బైరెడ్డిపల్లె: అర్హత ఉన్నవారికందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు అన్నారు. మండలంలో 158మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ పాలనలో పింఛన్లు మంజూరు కావాలంటే ఎవరైనా మృతి చెందితే వారి స్థానంలో కొత్త పింఛన్లు అరకొరాగా మంజూరు చేసేవారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న వారికి పింఛన్లు మంజూరు చేస్తోందని, అంతేకాకుండా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి ముంగిటే వలంటీర్లతో పింఛన్ల సొమ్మును అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటేష్, బాలక్రిష్ణగౌడు, విజయ, తబ్రాజ్, ఎంపీటీసీలు అభినయ్, ధనలక్ష్మి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కుప్పం చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు



ఫెన్సింగ్ నిర్మించే చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఇరిగేషన్ శాఖ అధికారులు

కుప్పం: మున్సిపల్ పరిధిలోని కుప్పం చెరువు అభివృద్ధికి జిల్లా కలెక్టర్ రూ.15లక్షలు మంజూరు చేశారని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలిపారు. పట్టణం పాతపేటలోని చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకుగాను ఈ నిధులు వ్యయం చేస్తామన్నారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా నిరోధించడానికి ఫెన్సింగ్ దోహదపడుతుందని, అంతేకాకుండా ఇక్కడ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారికి రక్షణగా ఉంటుందని చెప్పారు. ఫెన్సింగ్, ఇతర పనులు పూర్తయితే చెరువు వద్ద పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేదదీరవచ్చని పేర్కొన్నారు. చెరువును పరిశీలించి, ఫెన్సింగ్ పనులను ప్రారంభించే విషయమై ఇరిగేషన్ డీఈ హరినాథ్ రెడ్డి ,ఏఈలతో ఆయన చర్చించారు.

కల్యాణం..కమనీయం



పట్టణంలో పాతపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం భక్తజన సందోహం నడుమ కనుల పండువగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను వేదికపై కొలువుదీర్చి కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, మాంగల్య ధారణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూలమాల మార్పిడి చేసి స్వామివార్లకు మహా మంగళహారతిని సమర్పించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు దంపతులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

- పలమనేరు

